క్లుప్తంగా

పది కంప్యూటర్లు బహూకరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి గుడేటి జీవన్‌రావు పది కంప్యూటర్లను అందజేశారు. పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో అదే పాఠశాల ఉపాధ్యాయుడు తన మిత్రుడు బాణావతు రామునాయక్ ద్వారా హెచ్‌ఎం కె.జలజకు కంప్యూటర్లను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి జీవన్‌రావు సహకారమందించడంపై హర్షం వ్యక్తంచేస్తూ ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, జామా మోహన్‌రావు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు



నందిగామటౌన్(నందిగామ రూరల్): రాష్ట్ర గ్రాఫిటి అండ్ వాల్ పెయింటింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారని శ్రీఅక్షర డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ కాసరగడ్డ కిరణ్ తెలిపారు. పెయింటింగ్‌లో ప్రతిభచూపిన విద్యార్థులకు శనివారం స్థానిక కళాశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ స్టేట్ లెవల్ కోఆర్డినేటర్ ఫర్ ఆయిల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో సాక్షం–2025 పేరుతో గతనెల 14 నుంచి 28వతేదీ వరకు విజయవాడలో పలు రకాల పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో కళాశాల విద్యార్థులు గోపి, రేష్మ, లావణ్య, త్రివేణి, తాహాముస్నిర్ పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించినట్లు వివరించారు. ప్రతిభచూపిన విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.

వాహనాల తనిఖీ



వత్సవాయి: ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ పి.ఉమామహేశ్వరరావు సూచించారు. వత్సవాయిలో చిల్లకల్లు–వైరా రహదారిపై శనివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ప్రాముఖ్యం వివరించారు. హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ద్విచక్రవాహనదారులంతా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రమాద సమయాల్లో తలకు గాయాల కారణంగా మరణాల సంఖ్య అధికంగా ఉంటోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు అందరూ హెల్మెట్‌ను ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని ఆయన సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళి



వత్సవాయి : ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన వారికి గుర్తుగా అమరవీరుల దినోత్సవాన్ని వత్సవాయిలోని ఎస్సీకాలనీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి దావీదు మాట్లాడుతూ ఉద్యమంలో చనిపోయినవారిని స్మరించుకుంటూ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు యేశపోగు రవిబాబు, కుక్కల సురేష్, ఎం.బాబురావు, ఎమ్మార్పీఎస్ నాయకులు అరిగెల శ్రీను, కృపారావు, వై.డేవిడ్‌రాజు, రాయల పుల్లయ్య, కె.సందీప్, రాయల మురళి పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలకు ప్రోత్సాహకాలు



గౌరవరం(జగ్గయ్యపేట):గ్రామాల్లోని ప్రజలు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని డ్వామా పీడీ రాము సూచించారు. మండలంలోని గౌరవరం గ్రామస్తులకు ఇంకుడు గుంతల ప్రాధాన్యంపై శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంత నిర్మించుకున్న వారికి ప్రభుత్వం రూ. 5,500లను ప్రోత్సాహకంగ అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆయన గ్రామంలో కొనసాగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని వెంకటేష్, ఎంపీడీవో నితిన్, ఏపీవో రామకృష్ణ, కార్యదర్శి సంక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

- కొండను పిండి చేస్తున్న కాంట్రాక్టర్లు
- నిబంధనలు పాటించని వైనం
- అక్రమ తవ్వకాలతో ప్రభుత్వాదాయానికి గండి
- ముడుపుల మత్తులో జోగుతున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖలు



కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలు హద్దులు దాటి తవ్వకాలు జరుగుతున్న కొండ



కొండరాళ్లను పగులకొట్టేందుకు పేలుడు పదార్థాలను అమర్చుతున్న కార్మికులు

కంచికచర్ల : రాతి క్వారీల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్లు అడ్డూ అదుపు లేకుండా ఇష్టారాజ్యంగా భారీ రిగ్గులతో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. దీంతో అనుభవం, నైపుణ్యంలేని కార్మికుల జీవితాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతూ మిన్నకుండిపోతున్నారు. అటవీ భూముల్లో సైతం మైనింగ్ మాఫియా చొచ్చుకుని పోతోంది. ఇలా కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలో సాగుతున్న అక్రమ మైనింగ్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కొండలను పిండి చేస్తూ...

దొనబండ రాతి క్వారీల్లో సర్వే నంబర్ 801లో 1,204 ఎకరాల్లో కొండ పోరంబోకు భూమి ఉంది. ఆ పక్కనే కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ఉంది. ఆ ఫారెస్ట్‌లో పలురకాల జంతువులు, పక్షులు, విలువైన అటవీ సంపద ఉంది. గత ప్రభుత్వాలు 74మంది గుత్తేదారులకు ఇక్కడ మైనింగ్‌కు అనుమతులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు మిన్నకుండిపోతుండటం గమనార్హం.

విచ్చలవిడి తవ్వకాలు

అధికారపార్టీకి చెందిన కొంతమంది నాయకులు క్వారీ కాంట్రాక్టర్లు అవతారమెత్తి భారీగా కొండలను తవ్వి కోట్లలో అక్రమ సంపాదనకు తెరతీశారు. అధికారులకు ముడుపులు చెల్లించి వారి అండదండలతో యథేచ్ఛగా అక్రమంగా తవ్వకాలు జరిపి రూ.కోట్లు జేబులో వేసుకుంటున్నారు.

పర్యావరణానికి ముప్పు..

పెద్ద పెద్ద కొండరాళ్లను పిండి చేసేందుకు నాసిరకం జిలెటిన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. బ్లాస్టింగ్ శబ్దానికి కొండ పోరంబోకుకు ఆనుకుని ఉన్న కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లోని జంతువులు, పక్షులు పారిపోతున్నాయి. బ్లాస్టింగ్ చేసే సమయంలో సంభవించే పెద్దపెద్ద శబ్దాలకు కొన్ని జంతువులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోంది. అటవీ సంపద కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అటవీశాఖ అధికారుల ఆవేదన అరణ్యరోదనగానే మిగిలిపోతోంది.

తూతూమంత్రంగా పర్యవేక్షణ....

అక్రమంగా రాతి క్వారీల్లో తవ్వకాలు జరుపుతున్న సమయంలో మైనింగ్ అధికారులు, గానీ, రెవెన్యూ శాఖ, పోలీస్‌శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాంట్రాక్టర్లంతా కలిసి ఆయాశాఖల అధికారులకు నెలవారీ మామూళ్లు అందుస్తున్నారనేది ఇక్కడ బహిరంగరహస్యం. అందుకే అధికారులు మెటల్ క్వారీల వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మామూళ్లమత్తులో జోగుతున్న ఆయాశాఖల అధికారులు ఇకనైనా స్పందించి దొనబండ క్వారీల్లో అక్రమ మైనింగ్ సాగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు..

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్న క్వారీ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. బ్లాస్టింగ్‌తో పెద్దపెద్ద బండరాళ్లను సైతం పగులకొడుతుండటంతో ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు భయాందోనలు చెందుతున్నారు. ఈ బ్లాస్టింగ్‌ల కారణంగా పరిటాల, దొనబండ గ్రామాల్లోని ఇళ్లు బీటలు వారుతున్నాయి. బ్లాస్టింగ్ చేసే సమయంలో కార్మికులకు చేతులకు బ్లౌజులు, కాళ్లకు బూట్లు, కొండపైకి ఎక్కేందుకు బెంచీలు ఏర్పాటు చేయలేదు. కేవలం తాళ్ల సహాయంతో కొండపైకి ఎక్కి కార్మికులు కొండకు పెద్దపెద్ద గాతాలు పెట్టి బ్లాస్టింగ్ చేస్తున్నారు. నిపుణులతో కాకుండా కార్మికులతో బ్లాస్టింగ్ చేస్తుండటంతో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మైనింగ్ పనుల్లో అనుభవం, నైపుణ్యం కొరవడిన కార్మికులనే పెట్టుకుని బ్లాస్టింగ్‌లు చేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

కాంట్రాక్టర్ల అనుమతులను పరిశీలిస్తాం

త్వరలోనే రాతి క్వారీలకు వెళ్లి ప్రభుత్వం ఎంత మేరకు ఎవరెవరికి అనుమతులు మంజూరు చేసిందో స్వయంగా పరిశీలిస్తాం. ప్రభుత్వం కేటాయించిన క్వారీల్లోనే తవ్వకాలు జరుపుతున్నారా లేదా అని పూర్తిస్థాయిలో విచారణ చేపడతాను. అనుమతులు లేని క్వారీల విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లతాను.

వేమూరి మానస, ఇన్‌చార్జి తహసీల్దార్

మంచినీటి పథకం పరిశీలన

నందిగామటౌన్(నందిగామ రూరల్): రానున్న వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని వాటర్ ట్యాంక్‌లు, మంచినీటి పథకాన్ని శనివారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో తాగు, వాడుక నీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



జగ్గయ్యపేట: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానా తప్పదని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని పాతమున్సిపల్ సెంటరులో హెల్మెట్ ధారణపై శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చట్టంలోని ప్రత్యేక నిబంధనలు అమలులోకి వచ్చాయన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనంపై ఇద్దరు ప్రయాణిస్తే..ఇద్దరూ హెల్మెట్ ధరించాలన్నారు. లేనిపక్షంలో రూ.1000 జరిమానా విధిస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయటంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జగ్గయ్యపేటలో తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్న ఫస్టియర్ విద్యార్థులు



కీసరలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ బ్రదర్ సుధీర్, దుగ్గిరాల ప్రకాష్



నందిగామలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్:ఇంటర్మీడియట్ పరీక్షలు పట్టణంలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా పట్టణంలో ఉన్న ఎస్‌జిఎస్, వాగ్దేవి మహిళా కళాశాల, జేఆర్సీ , అమ్మాణీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలకు ఒక అరగంట ముందు మాత్రమే అనుమతిస్తామని ప్రకటించటంతో తమ గదులు, నంబర్లు తెలుసుకోవటానికి విద్యార్థులు ఆసక్తిచూపారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలకు కలిపి 1,330 మంది హాజరు కావాల్సి ఉండగా 1,187 మంది హాజరయ్యారు. 143 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్‌జిఎస్ కళాశాలకు చీఫ్ సూపరిండెంటెంట్‌గా వై.అంకయ్య, డీవోగా కరుణాకర్‌రెడ్డి, వాగ్దేవి మహిళా కళాశాలకు సీఎస్‌గా కిషోర్, డీవోగా హనుమంతరావు, జేఆర్సీ కళాశాలకు సీఎస్‌గా పి.రవి, డీవోగా ఆర్.శ్రీనివాసరావు, అమ్మాణీ కళాశాలకు సీఎస్‌గా స్వర్ణవాణి, డీవోగా శివయ్యను నియమించినట్లు కస్టోడియన్ శౌరిలమ్మ తెలిపారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు కంచికచర్ల మండలంలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కంచికచర్ల మండల పరిధిలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్షకు 877మంది హాజరుకావాల్సి ఉండగా 837మంది హాజరైనట్లు కస్టోడియన్ అధికారి వాసుదేవరావు తెలిపారు. 47మంది గైర్హాజరయ్యారని వివరించారు.

కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 170మంది విద్యార్థులు, ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో 186మంది, అక్షర డిగ్రీ కళాశాలలో 270మంది, కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో 199మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వాసుదేవరావు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు .

నందిగామలో..

నందిగామటౌన్(నందిగామరూరల్): నందిగామలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు ఆయా పరీక్షా కేంద్రాలకు వెళ్లిన విద్యార్థులు 12 గంటల వరకు పరీక్ష రాశారు. పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

అంకెల గారడీ...అమలు శూన్యం



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్ అంతా అంకెల గారడీ..అమలు శూన్యంగా ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్‌లో రైతులను, మహిళలను, యువతను ఇలా అన్ని వర్గాలను విస్మరించారని ఆయన విమర్శించారు. తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బడ్జెట్ వలన ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల కేటాయింపులు గమనిస్తే, లబ్ధిదారుల సంఖ్యలో కోత పడుతుందనే వాస్తవాలను చెప్పకనే చెపుతుందన్నారు. తల్లికి వందనం పథకానికి రెండేళ్లకి కలిపి రూ.25వేల కోట్లు అవసరమవుతుండగా, బడ్జెట్‌లో కేవలం రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులు చూశాక సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజల్లో ఇప్పటివరకు ఉన్న అనుమానాలు నిజమేనని స్పష్టమవుతున్నాయన్నారు. సంపద ఎలా సృష్టిస్తారో బడ్జెట్‌లో చెప్పలేదని ఎద్దేవా చేశారు. హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించకపోవడంతో ఇది మోసపూరిత బడ్జెట్ అని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రక్కన పెట్టి కేవలం అంకెల గారడీ చేయడం దారుణమన్నారు. ప్రజలు ఈ అసమతుల్య బడ్జెట్‌ను ఖండించాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

బాలికా విద్య ప్రాధాన్యం గుర్తించాలి



తల్లులకు పోషకాహార కిట్‌లను అందజేస్తున్న పీడీ శ్రీలక్ష్మి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

నందిగామరూరల్:ఆడపిల్లలను సంరక్షించడంతో పాటు బాగా చదివించాలని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి సూచించారు. మండలంలోని ఐతవరం, అనాసాగరం గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ప్రతి అంగనవాడీ కేంద్రాలలో మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పడావోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లులకు పౌష్టికాహార కిట్‌లను అందజేశారు. సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు కరుణ, వెంకటరావమ్మ, తారాబి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): ఆడపిల్లలను భారంగా భావించకుండా తల్లిదండ్రులు వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సీడీపీవో లక్ష్మీభార్గవి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని కొందరు తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించకుండా వివాహాలు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ఆడపిల్లలపై చిన్నచూపు చూడకుండా వారిని చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. బాలికలను చదివించడం బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్ రజనీ జ్వాలా, అంగనవాడీకార్యకర్తలు అరుణలక్ష్మి, స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల నిలుపుదల కోరుతూ వినతి



డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వీరులపాడు:వైరా ఏటిలోని నీటిని పైపులైన్లు వేసి అక్రమంగా కర్మాగారాలకు తరలిస్తే రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నందలూరు గ్రామ సమీపంలోని వైరాకట్టలేరు వద్ద నీటిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులను నిలుపుదల చేయాలని కోరుతూ రైతులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలోని సెంథినీ కర్మాగారం యజమానులు నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున మోటార్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వైరాఏటిలోని రక్షిత మంచి నీటి పథకం నుంచి నందలూరు, తాటిగుమ్మి, బోడవాడ, జమ్మవరం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని కర్మాగారం నీటిని తరలిస్తే తాగునీటికి అలమటించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డీటీకి వినతిపత్రం అందజేసినవారిలో రైతులు ఏలూరు సురేష్, వెంకటేశ్వరరావు, రాము, జూపూడి కోటేశ్వరరావు, భిక్షాలు, చిరంజీవి, పలువురు రైతులు ఉన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో మసీదు వద్ద కనువిందు చేస్తున్న నెలవంక



నెలవంక కనిపించెను

జగ్గయ్యపేట: ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమవుతుండటంతో శనివారం రాత్రి పట్టణంలోని మసీదు వద్ద నెలవంక కనిపించింది. సాయం సంధ్య వేళల్లో నిర్మలమైన ఆకాశం.. చూడచక్కని నెలవంక కనువిందు చేసింది. నెలవంకను చూసిన ముస్లింలు రంజాన్ మాసం ప్రారంభమవుతుందని సంతోషం వ్యక్తం చేయగా పట్టణ ప్రజలు నెలవంక అందాన్ని ఆస్వాదించారు.

ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

వీరులపాడు:క్రీడలు యువత ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామ సమీపంలోని ఏకత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ అండర్–14 బాలబాలికల ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు, పాఠశాల యాజమాన్యం, క్రీడాకారులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

కంచికచర్ల: కూటమి సర్కార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇష్టారీతిన హామీలు ఇచ్చి, తీరా ఆయా పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడమేమిటని ప్రజలు, నాయకుల్లో జోరుగా చర్చ సాగుతోంది. సీఎం చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప మరొకటి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేననే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్ చూస్తే వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేలా ఉందని విమర్శిస్తున్నారు. బడ్జెట్‌పై పలువురి అభిప్రాయాలు.. వారి మాటల్లోనే...

అమరావతి గ్రాఫిక్స్‌లా బడ్జెట్..



బడ్జెట్ అనేది ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలే తప్ప కోట్లు పోసి తెచ్చుకున్న కన్సెల్టెంట్లతో కలర్‌ఫుల్ గ్రాఫిక్స్‌తో నింపేసి పీపీటీల మాదిరిగా ఉండకూడదు. ఏపీ ఇండస్ట్రీ డవలప్‌మెంట్ పాలసీ 4.0 ఆవిష్కరించినప్పుడు ఐదేళ్లలో రూ.30లక్షల పెట్టుబడులు మరో 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. కాని బడ్జెట్‌లో కేటాయించింది తక్కువే.

–వేల్పుల ప్రశాంతి, జెడ్పీటీసీ సభ్యురాలు, కంచికచర్ల మండలం

దగా చేసిన కూటమి ప్రభుత్వం



చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యార్థులు, నిరుద్యోగులను తీవ్రంగా దగా చేసింది. నిరుద్యోగ భృతికి పైసా కూడా కేటాయించకపోవటం దారుణం. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన ఎక్కడా సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఎన్నికల సమయంలో అలవికాని హామీలు గుప్పించి, తీరా అధికారంలోకి వచ్చాక సంపద సృష్టించిన తర్వాతే పతకాలను అమలుచేస్తామని చెప్పడం కరెక్టకాదు.

– మార్త శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు


పొంతన లేకుండా పోయింది



వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని చెబుతున్న కూటమి ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ఈ రంగానికి కేటాయించిన నిధులు కేవలం 4శాతం మాత్రమే. పంటలకు ధరలు లేక నష్టపోతుంటే ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లు కేటాయించటం దారుణం. వ్యవసాయ బడ్జెట్‌లో కౌలు రైతులకు మొండిచెయ్యి చూపారు. కౌలురైతుల సంక్షేమం కోసం రూపాయి కూడా కేటాయించకపోవటం బాధాకరం.

–బండి మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ, మోగులూరు

సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వరా?..



సూపర్ సిక్స్ పథకాల హామీ కోసం రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. కాని బడ్జెట్‌లో వాటి ఊసే లేకుండా తుస్సు మనిపించారు. తల్లికి వందనం పథకం కోసం తమ పిల్లలను బడులకు పంపిస్తున్న తల్లులు ఈపథకం డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. కనీసం ఫీజులు చెల్లించలేని దుస్థితిలో కొన్ని కుటుంబాలున్నాయి. కూటమి ప్రభుత్వ చర్యల కారణంగా విద్యార్థుల తల్లుల ఆశలు అడియాసలయ్యాయి. మహిళలను నమ్మించి మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుంది.

–ఎం.రజిని, ఏఎంసీ మాజీ చైర్మన్, పరిటాల, కంచికచర్ల మండలం